# రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

- కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని తక్షణమే తరలించాలి
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



రికార్డులు సరిగా లేకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నార్కట్‌పల్లి/శాలిగౌరారం, మే 7 : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఇబ్బందులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. బుధవారం నార్కట్‌పల్లి మండలం షాపెల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ధాన్యాన్ని పరిశీలించి కొనుగోళ్లపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 2,5 తేదీల్లో లారీలు వచ్చాయని నిర్వాహకులు తెలుపగా.. సదరు వివరాలు రికార్డుల్లో పొందుపర్చక పోవడంపై నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలు తక్కువగా వస్తున్నాయని, వాటి సంఖ్య పెంచాలని రైతులు కలెక్టర్‌ను కోరగా ప్రతిరోజు రెండు లారీల ద్వారా ధాన్యాన్ని తరలించేలా చర్యలు తరలించాలని తాసీల్దార్‌ను ఆదేశించారు. ధాన్యాన్ని తరలించే సందర్భంలో బస్తాకు రూ.4 చొప్పున వసూలు చేస్తున్నట్లు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, రైతులు ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని, ఒకవేళ ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులు సరిగా నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆమె వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ హరీశ్, ఆర్డీఓ వై. అశోక్‌రెడ్డి, జిల్లా సహకారశాఖ అధికారి పత్యానాయక్, తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఆర్ఐ తరుణ్ రైతులు పాల్గొన్నారు.

శాలిగౌరారం మండలంలోని రామగిరి గ్రామ శివారులో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తున్న నిర్వాహకుడికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట తాసీల్దార్ యాదగిరి ఉన్నారు.

# ధాన్యం దిగుమతుల్లో జాప్యం చేయవద్దు

- సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ, మే 7: రైస్ మిల్లుల వద్దకు వచ్చే లారీల్లోని ధాన్యం దిగుమతుల్లో జాప్యం చేయవద్దని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ రైస్ మిల్లర్లకు సూచించారు. బుధవారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఐకేపీ సెంటర్ల నుంచి వస్తున్న ధాన్యం దిగుమతులపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. మిల్ పాయింట్ వద్ద లారీల్లోంచి ధాన్యం దిగుమతుల్లో ఆలస్యం కావడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు పేరుకుపోతున్నాయన్నారు. అకాల వర్షాలు వస్తున్న నేపథ్యంలో ధాన్యం తడిసి రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఐకేపీ కేంద్రాల నుంచి వస్తున్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్, మిల్లర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ అధికారులు ఉన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ఎగుమతికి చర్యలు

- ఆర్డీఓ రమణారెడ్డి



ఘనపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణారెడ్డి

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

పెద్దఅడిశర్లపల్లి, మే 7 : మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసి ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు ఎగుమతి చేసేందుకు చర్యలు చేపడతామని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. కొనుగోలు కేంద్రా ల్లో ధాన్యం ఎగుమతులు కాకుండా నిలిచి పోవడంపై బుధవారం నమస్తే తెలంగాణలో 'నిలిచిన ధాన్యం ఎగుమతులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన అంగడిపేట, ఘనపురం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రెవెన్యూ, వ్యవసాయ, సహకార పరపతి సంఘం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం ఎగుమతుల్లో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘనపురం కేంద్రంలో దాదాపు ఐదు లారీల ధాన్యం బస్తాలు ఉండడంతో తక్షణమే రెండు లారీలను పిలిపించి ధాన్యం ఎగుమతి చేయాలని, సాయంత్రం లోగా మరో మూడు లారీలను పిలిపించాలని అధికారులను ఆదేశించారు. లారీలు ఏర్పాటు చేయాలని రైతులు కోరగా మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. ఆర్డీఓ వెంట తాసీల్దార్ మధుహాసిని, ఆర్ఐ సత్యరాజు, ఏఓ పాండు ఉన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



ఈదులూరులో కార్మిక జెండా ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు

కట్టంగూర్, మే 7 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని ఈదులూరు గ్రామంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెంజర్ల సైదులు, పొన్న అంజయ్య, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురారి మోహన్, వెంకన్న, తవిటి వెంకటమ్మ, కాసర్ల స్వప్న పాల్గొన్నారు.

# పంటమార్పిడితో అధిక దిగుబడి

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

తిప్పర్తి, మే7: రైతులు పంట మార్పిడి అవలంబించడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని తిప్పలమ్మగూడెంలో బుధవారం కేవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని రైతులు సాగులో తీసుకోవాల్సిన మెళకువలు, పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, రాములమ్మ మాట్లాడుతూ అధిక యూరియా వాడడం వల్ల కలిగే నష్టాలు, పురుగుల మందుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్, ఏఓ సన్నిరాజు, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, సుదర్శన్‌రెడ్డి, తోట సత్తిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

గుర్రంపోడు, మే 7 : మండల కేంద్రంలోని పిట్టల గూడెం గ్రామానికి చెందిన సునీత (50) బుధవారం వడదెబ్బతో మృతి చెందింది. ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్లిన ఆమె పని ప్రదేశంలోనే అస్వస్థతకు గురై కుప్పకూలింది. వెంటనే 108 వాహనంలో నల్లగొండ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. ఆమె వడదెబ్బతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

# బోరు రిపేరుకూ పైసల్లేవ్

- దామెరభీమనపల్లిలో వారం రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న దళిత వాడ ప్రజలు
- వ్యవసాయ బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్న వైనం





దామెరభీమనపల్లిలో వ్యవసాయ బోరుకు పైపు అమర్చి నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

మర్రిగూడ, మే 7 : గ్రామ పంచాయతీల్లో డబ్బులు లేక బోరు మోటరు చెడిపోతే రిపేరు చేయించలేని పరిస్థితి నెలకొంది. దాంతో గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు డాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని దామెరభీమనపల్లి దళితవాడలో వారం రోజులుగా తాగు నీటి సమస్య నెలకొంది. వాడకు నీటిని అందించే బోరు మోటరు చెడిపోయి వారం దాటినా మరమ్మతులు చేయించక పోవడంతో ప్రజలు నీరు లేక అల్లాడుతున్నారు. స్నానానికి, బట్టలు ఉతికేందుకు, కనీసం వంట పాత్రలు శుభ్రం చేయడానికి కూడా నీళ్లు లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క మిషన్ భగీరథ నీళ్లు ఇలా ఇంటికి రెండు బిందెలు మాత్రమే వస్తున్నాయని, దాంతో కనీసం తాగేందుకు కూడా నీరు లేక అల్లాడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు పంచాయతీ కార్యదర్శికి అనేకసార్లు చెప్పినప్పటికీ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమీ లేక సమీపంలోని వ్యవసాయ బోరుకు పైపును అమర్చి నీటిని పట్టుకుంటున్నట్లు తెలిపారు. మరి కొందరు బకెట్లు, బిందెలతో నీటిని మోసుకోవాల్సి వస్తున్నది. గత పదేండ్లలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటిని అందించాలని కోరుతున్నారు.

### బోరు మోటరు రిపేరుకు డబ్బుల్లేవు

ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా గ్రామంలో మంచినీటి సమస్య ఉన్నది వాస్తవమే అన్నారు. బోరు బావిలో మోటరు ఇరుక్కుపోయింని, గ్రామపంచాయతీలో డబ్బులు లేవని తెలిపారు. ఖర్చుతో కూడిన సమస్య కావడంతో మోటరుకు మరమ్మతులు చేయించలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానన్నారు.

\- పంచాయతీ కార్యదర్శి శంకర్

# వెల్మినేడు మాజీ సర్పంచ్ మృతి



వీరయ్య(ఫైల్)

చిట్యాల, మే 7 : వెల్మినేడు మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు అరూరి వీరయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన 1995 నుంచి 2000 వరకు, 2006 నుంచి 2011 వరకు రెండు పర్యాయాలు వెల్మినేడు సర్పంచ్‌గా పని చేశారు. వెల్మినేడు పీఏసీఎస్ చైర్మన్‌గా కూడా పనిచేశారు. వీరయ్య మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్‌ఎస్ నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, సీపీఎం కేంద్ర కమీటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కమిటీ సభ్యుడు బొంతల చంద్రారెడ్డి, నాయకులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య, మల్లం మహేశ్, మేక అశోక్‌రెడ్డి గ్రామానికి వెళ్లి వీరయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

### పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న రైతులు గుర్తింపు కార్డు పొందాలి : ఏఓ

అడవిదేవులపల్లి, మే 7: కేంద్రం ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధి పొందేందుకు డిజిటల్ సైన్ ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకం కలిగిన రైతులందరూ రైతు గుర్తింపు కార్డును పొందాలని ఏఓ గుర్రం సరిత సూచించారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఫార్మర్ ఐడీ పొందడానికి వారి ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నంబర్‌ను తీసుకొని ఏఈఓలను సంప్రదించాలని సూచించారు.

### మర్రిగూడ ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు

మర్రిగూడ, మే 7 : సివిల్ తగాదాలో జోక్యం చేసుకోవడంతో పాటు ఎలాంటి విచారణ చేయకుండా తనపై అక్రమ కేసు నమోదు చేసిన మర్రిగూడ ఎస్ఐ కృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గట్టుప్పల మండలం అంతంపేటకు చెందిన ఐతరాజు హనుమంతు బుధవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 218లో తనకు వారసత్వంగా వచ్చిన ఎకరం భూమిని సాగు చేసేందుకు లెవెలింగ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. కొందరు వ్యక్తులు ఆ భూమిలో వాటా కోసం వాగ్వాదం చేయగా హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. అయితే కొంతమంది తనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టకుండానే కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ విషయమై ఎస్ఐని వివరణ కోరగా గతంలో అదే భూమి తగాదా విషయమమై హనుమంతుపై కేసు ఉందని, మళ్లీ ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

### చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు, జరిమానా

కట్టంగూర్, మే 7 : చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ బుధవారం నకిరేకల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ ఆరిఫ్ తీర్పు చెప్పారు. కట్టంగూర్ ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అయిటి పాముల గ్రామానికి చెందిన నకిరేకంటి సైదులు 2024 అక్టోబర్ 30న అదే గ్రామానికి చెందిన పులిజాల నర్సింహ ఇంట్లోకి చొరబడి బీరువాను ధ్వంసం చేసి అందులోని 4 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు ఎత్తుకెళ్లాడు. బాధితుడు నర్సింహ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవీందర్ దర్యాప్తు చేపట్టి సైదులును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. బుధవారం ఈ కేసు విచారించిన జడ్జి నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధించారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దామరచర్ల, మే 7: మిర్యాలగూడ 220 కేవీ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 33 కేవీ మాటూర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్‌ను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున గురువారం తిమ్మాపురం సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరాను నలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అబ్దుల్ హబీబ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు తిమ్మాపురం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు.

# ఉగ్రవాద స్థావరాలపై దాడులకు సంపూర్ణ మద్దతు : ఎంపీ రఘువీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి

మిర్యాలగూడ, మే 7: దేశ రక్షణ, సమైక్యత, సమగ్రత కోసం కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై చేపడుతున్న దాడులకు భారత పౌరుడిగా తాను సంపూర్ణ మద్దతు తెలుపుతున్నానని ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పహల్గావ్ ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు అమరులయ్యారని, దీనికి జవాబుగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ చేపట్టి సుమారు 9 ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి ధ్వంసం చేయడంపై సైన్యాన్ని అభినందించారు. ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ వల్ల విచ్ఛిన్నకర శక్తులకు బుద్ధి చెప్పినట్లయిందని అన్నారు. సమావేశంలో మిర్యాలగూడ, అంబర్‌పేట ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, ఆలేరు వెంకటేశం, నాయకులు ఉన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మే 7: పట్టణంలోని 27వ వార్డుకు చెందిన షేక్ షబ్బీర్ మహ్మద్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.50 వేల విలువైన చెక్కును బుధవారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సహాయ నిధిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, గొట్టిముక్కల లక్ష్మణ్, దేశిడి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# దేవస్థాన బోర్డు చైర్మన్‌గా బీసీలకు అవకాశం కల్పించాలి

- మంత్రి కొండా సురేఖకు జాజుల లింగంగౌడ్ వినతి



దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు వినతి పత్రం అందచేస్తున్న జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, మే 7: యాదగిరి గుట్ట దేవస్థాన బోర్డు చైర్మన్‌గా బీసీలకు అవకాశం కల్పించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ బుధవారం హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సర్పంచ్ నుంచి మంత్రుల వరకు కేవలం ఒకే కులానికి చెందిన వారు ఉంటున్నారని, కనీసం దేవస్థాన చైర్మన్ పదవైనా బీసీలకు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట బూర శ్రీనివాస్‌గౌడ్, గోదా రవీందర్, చంద్రమోహన్‌రాయ్ ఉన్నారు.

# సర్వేయర్ల కొరతతోనే పెండింగ్‌లో భూ వివాదాలు

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిరేకల్, మే 7 : సర్వేయర్ల కొరత కారణంగా భూముల సర్వే విషయంలో అనేక వివాదాలు ఉన్నాయని, ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఇస్తున్నందున సమస్యలు తీరిపోతాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. భూ భారతి చట్టంలో సాదాబైనామా, పీఓటీ వంటి సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కల్పించిందన్నారు. సాదాబైనామాకు సంబంధించి సుప్రీంకోర్టులో కేసు ఉండడం వల్ల అలాంటి వాటిని పరిష్కరించేందుకు సమయం పడుతుందని, ఆర్డీఓ కార్యాలయంలో వీటిని రెగ్యులరైజ్ చేసేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్, ఆర్ఐ శ్యాంసుందర్, సర్వేయర్లు మధు, అరవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి

- ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ ఖుస్రో షాఖాన్



బస్టాండ్ ఆవరణలో మొక్క నాటుతున్న ఈడీ

నల్లగొండ సిటీ, మే 7 : ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని సంస్థ హైదరాబాద్ ఈడీ ఖుస్రో షాఖాన్ అన్నారు. బుధవారం నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన సందర్శించారు. బస్టాండ్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఆర్ఎం జానిరెడ్డితో కలిసి మెక్కను నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలన్నారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో శుభ్రత పాటించాలన్నారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న షాపుల వారు ఎమ్మార్పీకే వస్తువులను విక్రయించాలని సూచించారు. ఆయన వెంట డిపో మేనేజర్ శ్రీనాథ్, అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్, ఎంఎఫ్ సునీత ఉన్నారు.

# టీఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ



కృష్ణకు నియామక పత్రం అందజేస్తున్న మధుబాబు

కట్టంగూర్, మే 7 : టీఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన ఊ ట్కూరి కృష్ణ ఎన్నికయ్యారు. బుధవారం నల్లగొండలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు యడవల్లి మధుబాబు అధ్యక్షుడిగా ఎన్నికైన కృష్ణకు ధ్రువ పత్రం అందించారు.

# లచ్చిరాంనాయక్ సేవలు మరువలేనివి

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి



ఆంగోతు లచ్చిరాం విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), మే 7: గిరిజనుల అభ్యున్నతికి ఆంగోతు లచ్చిరాంనాయక్ సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని రంగుండ్ల గ్రామానికి చెందిన ఆంగోతు లచ్చిరాం 9వ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని ఆయన విగ్రహానికి బుధవారం ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఆంగోతు భగవాన్‌నాయక్, అల్లి పెద్దిరాజుయాదవ్, నాయకులు బీవీ.రమణరాజు, కోట్యానాయక్, బాబురావునాయక్, రమావత్ రవికుమార్‌నాయక్, మంగ్తానాయక్, శ్రీనునాయక్, సర్దార్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

### టీఆర్‌జీఎస్ ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలో లచ్చిరాంనాయక్ చిత్రపటానికి టీఆర్‌జీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రవణ్‌కుమార్, రామకృష్ణ, నాదెండ్ల కృష్ణారెడ్డి, మెగావత్ భాస్కర్‌నాయక్, కలమ్మ, పిట్టల కృష్ణ, ధనావత్ మునినాయక్ పాల్గొన్నారు.



బొల్లిగుట్టతండాలో పాప్యనాయక్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న రవీంద్రకుమార్

# పాప్యనాయక్ కుటుంబానికి రవీంద్రకుమార్ పరామర్శ

దేవరకొండరూరల్, మే 7 : మండలంలోని బొల్లి గుట్ట తండాకు చెందిన పాప్యనాయక్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ బుధవారం గ్రామానికి వెళ్లి పాప్యానాయక్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఉమేందర్, మాజీ ఎంపీటీసీ సైదులు, రేణు గౌడ్, కళ్యాణ్‌నాయక్, బొడ్డుపల్లి కృష్ణ, తుల సీరాం ఉన్నారు.

### పదో తరగతి విద్యార్థికి సన్మానం

చందంపేట(దేవరకొండ) : దేవరకొండ మండలం బొల్లిగుట్టతండాకు చెందిన మనోజ్ పదో తరగతి ఫలితాల్లో 541 మార్కులు సాధించడంతో బుధవారం మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అభినందించారు. మనోజ్‌ను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

# రియల్ హీరోస్ అవార్డు గ్రహీతలకు ఎస్పీ అభినందన



అవార్డు గ్రహీతలను అభినందిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, మే 7 : అంతర్రాష్ట్ర దొంగల ముఠా పార్థీ గ్యాంగ్‌ను ఇటీవల చాకచక్యంగా పట్టుకున్న సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరి, ఐటీ కోర్ విభాగంలో పనిచేస్తున్న విక్రమ్‌కు జీ నెట్‌వర్క్ వారు తెలంగాణ రియల్ హీరోస్ అవార్డును అందించారు. వారు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. బుధవారం వారికి ఎస్పీ శరత్ చంద్ర పవార్ తన చాంబర్‌లో అభినందించారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మైనంపల్లి తండాలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

దేవరకొండరూరల్, మే7 : మండలంలోని మైనంపల్లి, శక్రుతండాలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ బుధవారం ప్రారంభించారు. అనంతరం మండలంలోని మర్రిచెట్టుతండాలో రూ.15 లక్షల వ్యయంతో మైత్రి ఫార్మర్ ప్రొడ్యుసర్ కంపెనీవారు నిర్మించిన గోదాంను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జమునా మాధవరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ ఎంపీటీసీ కొర్ర గౌత మీరాంసింగ్, మాజీ సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.




చందుపట్ల గ్రామంలో బీఆర్‌టీయూ జెండాను ఆవిష్కరిస్తున్న సిలువేరు ప్రభాకర్

# సమస్యల పరిష్కారానికి కార్మికులు ఉద్యమించాలి

- బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలువేరు ప్రభాకర్

నకిరేకల్, మే 7 : సమస్యల పరిష్కారానికి కార్మికులు ఐక్యం గా ఉద్యమించాలని బీఆర్‌టీ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలువేరు ప్రభాకర్ పిలుపునిచ్చారు. మండలంలోని చందుపట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన మేడే కార్యక్రమంలో పాల్గొని బీఆర్‌టీయూ జెండాను విష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలుచేయాలని, కాం ట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి, కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వనం చందర్‌రావు, మాజీ ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీవెంకన్న, నాయకులు గోనె నర్సింహారావు, ఆలకుంట్ల యాదగిరి, తండు సత్తయ్య, ఆలకుంట్ల శంకర్, పగడాల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వీరయ్య, గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

శాలిగౌరారం, మే 7 : మండలంలోని గురజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు సాంబయ్య, అశోక్, రాంరెడ్డి, వెంకన్న, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.